

డాక్టర్ రవీంద్రనాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజగోపాల్, అజాద్ అహ్మద్ తదితరులు

స్థానిక ఎన్నికలకు ముందే పదోన్నతులు

- తెలంగాణ మినిస్ట్రీయల్ అండ్ గెజిటెడ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్

నల్లకుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే తమకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ మినిస్ట్రీయల్ అండ్ గెజిటెడ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇల్లందుల రాజగోపాల్, అజాద్ అహ్మద్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం డీఎంఈ, డీహెచ్ కార్యాలయాల్లో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఉన్నతాధికారులకు సమర్పించారు. వైద్య, ఆరోగ్య శాఖలో మినిస్ట్రీయల్ పీజీవోలుగా పనిచేస్తున్న తమకు పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు కల్పించాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్ర నాయక్, డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్‌లకు వినతిపత్రం సమర్పించామని తెలిపారు. కొంత కాలంగా ఆఫీస్ సెక్రటరీ టు ఏవో, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ పదోన్నతుల కోసం 400 మంది ఎదురు చూస్తున్నారన్నారు. ఈ విషయంపై కొన్నేళ్లుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తే ఇన్ని రోజులు కోర్టు కేసులను కాలయాపన చేశారన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేనందున వెంటనే పదోన్నతులు కల్పించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల ముందే పదోన్నతులు కల్పించేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ లతీఫ్, దస్ ముజాహిద్, ధరావత్ గోవింద్, మహమ్మద్ సలావుద్దీన్, జె.రవీందర్, కోశాధికారి అఫ్జల్‌ఖాన్, సంయుక్త కార్యదర్శి యుగంధర్, దివ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ అషక్ అహ్మద్, పబ్లిసిటీ సెక్రటరీ విజయలక్ష్మి, ఉమెన్స్ వింగ్స్ సెక్రటరీ తన్వీర్ జైనాబ్ తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణకు అరుదైన గౌరవం అభినందనీయం

- టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్

నల్లకుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణకు అరుదైన గౌరవం దక్కడం అభినందనీయం అని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ అన్నారు. సినీరంగంలో 50 ఏళ్ల ప్రయాణం పూర్తి చేసుకున్నందుకు గాను ఈనెల 20న 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా(ఇఫి 2025) వేదికపై సత్కారించుకోవడం జరుగుతోందన్నారు. మంగళవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నందమూరి బాలకృష్ణ, తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్‌లకు ఈ వేదికపై కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ గౌరవ సత్కారం పొందనున్నారన్నారు.



విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా, అక్లక్ హుస్సేన్

ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అవలర్చుకోవాలి

ముషీరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకొని ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా అన్నారు. మంగళవారం 80మంది విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేశారు. భోలక్‌పూర్ ప్రభుత్వ బాలికల వసతి గృహంలో బీఆర్ఎస్ నాయకుడు అక్లక్‌హుస్సేన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. చలికాలంలో అనాథలు, పేదలు సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటారని, వారిని ఆదుకునేందుకు బీఆర్ఎస్ నేతలు ముందుకు రావాలి అని జైసింహా అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ నాయకులు మున్వర్‌చాంద్, ఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గ నిర్ణయం సరికాదు : బీసీ పొలిటికల్ ఫ్రంట్

రాంనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పార్టీ గుర్తు లేకుండా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరపాలని మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం సరైంది కాదని బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం చిక్కడపల్లిలోని కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రివర్గ నిర్ణయాన్ని బీసీ ప్రజాప్రతినిధులు వ్యతిరేకిస్తూ రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ గుర్తు లేకుండా గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎలా జరుగుతాయని అన్నారు. దీనికి నిరసనగా డిసెంబర్‌లో జరిగే ప్రజాపాలన వారోత్సవాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫ్రంట్ కన్వీనర్లు ఐలి వెంకన్నగౌడ్, ఎ.విజయ్‌కుమార్‌గౌడ్, అంబాల నారాయణగౌడ్, భైరు శేఖర్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లో చిక్కడపల్లి ప్రజలు ఎంతో కాలంగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే చర్యలు చేపట్టినట్లు డివిజన్ కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ వెల్లడించారు. డివిజన్‌లో సేవరేజి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రూ. 55 లక్షల అంచనాతో గోల్కొండ చౌరస్తా వద్ద నుంచి ఆర్టీసీక్రాస్‌రోడ్స్ వరకు ఏర్పాటు చేసిన తాగునీటి పైప్‌లైన్ పనులు, 12 లక్షల అంచనాతో వీవీగిరినగర్‌లో నూతన సేవరేజి పైప్‌లైన్ పనులను మంగళవారం వాటర్‌బోర్డ్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలుతో కలిసి ఆమె పర్యవేక్షించారు. వీవీ గిరినగర్‌లో ఎక్కువ విస్తీర్ణం కలిగిన సేవరేజి పైప్‌లైన్ కూడా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, వాటర్‌బోర్డు వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్, బీజేపీ నేతలుపాల్గొన్నారు.

సంగీత స్వరశిఖరం.. సాలూరి రాజేశ్వరరావు

చిక్కడపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాలూరి రాజేశ్వరరావు లలిత, సినీ సంగీత స్వర శిఖరం అని ఘంటసాల సంగీత కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ అయ్యగారి శ్యామ్‌సుందర్ అన్నారు. వంశీ ఇంటర్నేషనల్ ఇండియా ఆధ్వర్యంలో సాలూరి రాజేశ్వరరావు 103వ జయంతి సందర్భంగా ప్రముఖ గాయని డా. సుహాసిని ఆనంద్‌కు సాలూరి రాజేశ్వరరావు వంశీ జాతీయ పురస్కార ప్రదానం సభజరిగింది. ముఖ్యఅతిథిగా శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ భాషకు భావం సాలూరి తన స్వర రచనలో పొందుపరచిన మహాసంగీత విశ్వరూపం అన్నారు. ఆయన పేరిట పురస్కారాన్ని అందుకున్న సుహాసిని సంగీతంలో పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా పొందిన విదుషీమణి అని అభినందించారు. జయలక్ష్మీ శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ వంశీ సంస్థ ఎందరో కళాకారులను సత్కరిస్తోందన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందించాలి

రాంనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులలోపేద ప్రజలకు సరైన వైద్య సేవలందించాలని, మెరుగైన సేవల కోసం కావాల్సిన బడ్జెట్‌ను వెంటనే విడుదల చేయాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రులలో సరైన వైద్య సేవలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైద్యశాఖమంత్రి అధికారులతో చర్చించి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

10 నిమిషాల్లోనే.. చిక్కడపల్లి నుంచి లిబర్టీకి..

- తుదిదశకు అశోక్‌నగర్ నాలా లింక్ బ్రిడ్జి
- సూరజ్‌నగర్ వైపు ర్యాంప్ పనులు షురూ
- నెల రోజుల తర్వాత ప్రారంభానికి ఏర్పాట్లు



నిర్మాణంలో ఉన్న అశోక్‌నగర్ నాలా లింక్‌బ్రిడ్జి

చిక్కడపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ నాలా మీద నిర్మిస్తున్న లింక్ బ్రిడ్జి నిర్మాణం పనులు తుదిదశకు చేరాయి. దోమలగూడ సూరజ్‌నగర్ వైపు బ్రిడ్జిపై ర్యాంపు పనులు మంగళవారం మొదలయ్యాయి. వారం రోజుల్లో ఈ పనులు పూర్తయితే మరో నెలరోజుల్లో బ్రిడ్జిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- చిక్కడపల్లి మెయిన్‌రోడ్, సుధాహోటల్, సిటీసెంట్రల్ లైబ్రరీ మీదుగా నేరుగా అశోక్‌నగర్ నాలా వయా సూరజ్‌నగర్, దోమలగూడ, గగన్‌మహల్ మీదుగా లిబర్టీకి చేరుకునేందుకు గాను బ్రిడ్జి నిర్మిస్తున్నారు. రెండేళ్లుగా పనులు సాగుతున్నాయి. బ్రిడ్జికి ఇరువైపులా ప్రహరీలు, బ్రిడ్జి రోడ్డు కూడా పూర్తయ్యింది.
- దీంతో చిక్కడపల్లి, అశోక్‌నగర్, జవహర్‌నగర్, వివేక్‌నగర్, సంజయ్‌నగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్, బాగ్‌లింగంపల్లి వాసులకు ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల ఎంతో ఉపయోగం చేకూరనుంది. నారాయణగూడ సిగ్నల్, హిమాయత్‌నగర్ సిగ్నల్‌లను దాటి లిబర్టీకి చేరుకునేందుకు కనీసం 20 నిమిషాల సమయం పడుతుంది. ప్రస్తుతం నిర్మాణం అవుతున్న బ్రిడ్జి మీదుగా 10 నిమిషాల్లో చిక్కడపల్లి నుంచి లిబర్టీ చేరుకోవచ్చు.

ట్రాఫిక్ చింత ఉండదు



చిక్కడపల్లి నుంచి లిబర్టీ, సచివాలయానికి చేరుకునేందుకు వాహనచోదకులకు వారధిగా అశోక్‌నగర్ నాలాపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిలుస్తుంది. ఇక ట్రాఫిక్ రద్దీ అనే చింత ఉండదు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో మాల్స్, చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీఆంజనేయస్వామి ఆలయం పునర్నిర్మాణం కావడం వల్ల రద్దీ పెరిగింది.

ముఠా గోపాల్, ఎమ్మెల్యే

రోడ్డు వెడల్పు చేయాలి



లింక్ బ్రిడ్జి నిర్మాణపు పనులు నత్తనడకన సాగాయి. చిక్కడపల్లి మెయిన్‌రోడ్ నుంచి వచ్చే ట్రాఫిక్ రద్దీని తట్టుకునేందుకు రోడ్డును వెడల్పు చేయాలి. చిక్కడపల్లి మెయిన్‌రోడ్ నుంచి అశోక్‌నగర్ నాలాపై నిర్మిస్తున్న బ్రిడ్జి వరకు చేస్తే మంచిది. అలాగే దోమలగూడ సూరజ్‌నగర్ వద్ద కూడా రోడ్డు వెడల్పు చేయాల్సి ఉంది. లేకుంటే బ్రిడ్జి నిర్మించిన ప్రయోజనం దక్కదు.

పావనివినయ్‌కుమార్, కార్పొరేటర్

మాస్టర్స్ గేమ్స్ స్పోర్ట్స్ ఉపాధ్యక్షుడిగా డేవిడ్

చిక్కడపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి మాస్టర్స్ గేమ్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ తెలంగాణ కమిటీ నూతన ఉపాధ్యక్షుడిగా డేవిడ్ ఫ్రాన్సిస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో రాష్ట్ర, జాతీయస్థాయిలో పాటు నేపాల్‌లో ఇటీవల జరిగిన ఈవెంట్‌లోనూ పతకాలు సాధించారు. ఆ మేరకు మంగళవారం చిక్కడపల్లిలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఆయనను మాస్టర్స్ గేమ్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు జీవన్‌రెడ్డి, నియోగి, వినయ్‌కుమార్‌తో పాటు పలువురు క్రీడాభిమానులు సన్మానించారు. క్రీడల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని డేవిడ్ తెలిపారు.



డేవిడ్ ఫ్రాన్సిస్‌ను సన్మానిస్తున్న యువతులు

ఘనంగా సత్యసాయి శత వర్ష దినోత్సవం



సత్యసాయి భగవాన్ శత వర్ష దినోత్సవాల్లో భాగంగా మంగళవారం సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో భక్తి సంగీత కచేరీ, నగర సంకీర్తన, సేవా కార్యక్రమాలు, గోవర్ధన పూజలు జరిగాయి. విద్యానగర్‌లోని శివం రోడ్‌లో నిర్వహించిన ఘంట శ్రీహర్ష, పృథ్వీరాజ్ సాయిచంద్‌లతో భక్తి సంగీత విభావరి అలరించింది. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

చిక్కడపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వెల్ఫేర్‌సెంటర్ నూతన భవనంలో నిర్వహించిన కళాప్రదర్శనలు రంజకంగా సాగాయి. అశోక్‌నగర్ వెల్ఫేర్ సెంటర్ ఆధ్వర్యంలో నెలనెలా కళావెన్నెల పేరిట నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా దీన్ని నిర్వహించారు. ప్రముఖ నృత్యగురువు పండిట్ అంజిబాబు శిష్యులు ప్రదర్శించిన కథక్ నృత్యప్రదర్శనలు సభ్యులు, ఆహుతులను అలరించాయి. ప్రముఖ గాయకుడు, నంది అవార్డుగ్రహీత వినోద్‌బాబు పర్యవేక్షణలో గాయనీ గాయకులతో పాటు ఆయన ఆలపించిన సినీగీతాలు, భక్తిగేయాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాకారులను అశోక్‌నగర్ వెల్ఫేర్ అసియేషన్ అధ్యక్షుడు బాసాని సూర్యప్రకాష్ సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు శివన్నాయుడు, అంజిబాబు, కొమరవోలు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



అసంపూర్తిగా ఉన్న బాకారం గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కె.రవిచారి, బస్తీ అధ్యక్షుడు పి.అనిల్‌కుమార్‌యాదవ్

బాకారం గ్రంథాలయ పనులు వెంటనే పూర్తి చేయాలి : కార్పొరేటర్

రాంనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాంనగర్ డివిజన్ బాకారంలో నగర గ్రంథాలయ సంస్థ.. గ్రంథాలయ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలని కార్పొరేటర్ కె.రవిచారి పేర్కొన్నారు. 82 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న ఈ భవనం రెండు సంవత్సరాలైనా పూర్తి కాలేదన్నారు. దీనికి గ్రంథాలయ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమన్నారు. దీంతో ఈ ప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందన్నారు. మంగళవారం బాకారం బస్తీ అధ్యక్షుడు పాశం అనిల్‌కుమార్‌యాదవ్, నాయకులు బీ.సీ.వెంకటేషంతో కలిసి ఆయన గ్రంథాలయాన్ని పరిశీలించారు. గ్రంథాలయంలో తాగి పడేసిన మందు బాటిల్స్, ఇతరత్ర వ్యర్థాలు దర్శనం ఇవ్వడంపై ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళ తాగుబోతులు, గంజాయి బ్యాచ్‌లు అందులో చేరి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక బస్తీవాసులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని లింకులను ఓపెన్ చేయొద్దు

- డీఐ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డీఐ వెంకటేశ్వర్లు

కవాడిగూడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్లలోకి వచ్చే గుర్తు తెలియని లింకులను తెరవొద్దని, డీజిటల్ అరెస్టుల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని గాంధీనగర్ డీఐ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం గాంధీనగర్ పీఎస్ పరిధిలోని గాంధీ మెడికల్ నర్సింగ్ కళాశాలలో సైబర్ నేరాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏపీకే ఫైల్స్ ద్వారా నిత్యం సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇందుకు గాను గాంధీనగర్ పీఎస్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గాంధీనగర్ పీఎస్ ఎస్ఐలు హరీష్ సాయిలిఖిత్, పి.మౌనిక, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం



వృద్ధుడి మృతదేహం

కవాడిగూడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని దోమలగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దోమలగూడ పీఎస్ సీఐ మహ్మద్ అంజద్ ఆలీ తెలిపిన వివరాల ప్రకారం... స్టీల్ బ్రిడ్జి పిల్లర్ నంబర్ 3 వద్ద ఓ వ్యక్తి పడి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా మృతిచెందాడని నిర్ధారించుకున్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు ఎవరైనా ఉంటే దోమలగూడ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.



ఉమామహేశ్వర కల్యాణాన్ని జరుపుతున్న అర్చకులు

కనుల పండువగా కల్యాణోత్సవాలు

చిక్కడపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమామహేశ్వర కల్యాణం మంగళవారం జరిగింది. కార్తీకమాసం.. మాసశివరాత్రిని పురస్కరించుకుని ఆర్టీసీక్రాస్‌రోడ్ లక్ష్మీగణపతి ఆలయం ఆవరణలో ఉన్న మందిరంలో వేడుక నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై ప్రత్యేకపూజలు చేశారు. ఈవో లక్ష్మారెడ్డి, చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలోని సీతారామ కల్యాణ మండపంలో శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ జనరల్ బంటారం యాదగిరిగౌడ్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ఈవో మాచర్ల దేవనాథం, చైర్మన్ జానకీ సుధాకర్, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పోక్సో చట్టాలపై అవగాహన తప్పనిసరి

- హోంగార్డ్స్ అండ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అదనపు డీజీపీ స్వాతి లక్రా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్వాతి లక్రా, డాక్టర్ సరోజా వివేక్ తదితరులు

రాంనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని హోంగార్డ్స్ అండ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అదనపు డీజీపీ స్వాతి లక్రా పేర్కొన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి.. డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె.. పోక్సో చట్టానికి సంబంధించిన న్యాయ, మానసిక, విధానపరమైన అంశాలను వివరించారు. విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, క్షణికావేశాలకు గురై భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థల కరస్పాండెంట్, మంత్రి జి.వివేక్ సతీమణి డాక్టర్ సరోజా వివేక్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ అల్లూరి రాంరెడ్డి, డీసీపీ డాక్టర్ అశోక్ పగడాల, కంపాస్ లా అసోసియేషన్ సీఈవో ప్రియాఅయ్యంగార్, డాక్టర్ మమతా రఘువీర్, తారుణి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పించండి

- స్వామి వివేకానందనగర్ వాసులు

చిక్కడపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని నిర్వాసితులైన గాంధీనగర్ డివిజన్ స్వామి వివేకానందనగర్ బస్తీబస్తీవాసులు అన్నారు. మంగళవారం బస్తీవాసులు ఆనంద్‌రావు, ఎంబీ కృష్ణ, జ్ఞానేశ్వర్, పూజరేఖ, పద్మావతిలు విలేకరులతో మాట్లాడారు. స్వామి వివేకానందనగర్ బస్తీలోని 19 ఇళ్లను రెవెన్యూ, జీహెచ్ఎంసీ వారు కూల్చివేసి రెండు సంవత్సరాలు గడుస్తున్నా పునరావాసం కల్పించడం లేదన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తామని చెప్పిన ప్రభుత్వ అధికారులు ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ. డా. కె.లక్ష్మణ్, స్థానిక గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ చొరవతో మంత్రులు, జాతీయ ఎస్సీ కమిషన్, కలెక్టర్, ఆర్‌డీవోలను కలిశామన్నారు. అయినా ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమకు ఇచ్చిన హామీ మేరకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయ రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్ ఇవ్వాలి

చిక్కడపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్ర గ్రంథాలయ రిటైర్డ్ ఉద్యోగులకు ఈనెల పింఛన్ ఇవ్వాలని గ్రంథాలయ పెన్షనర్స్ సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పి. చంద్రయ్య అన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన చిక్కడపల్లి సిటిసెంట్రల్ లైబ్రరీ వద్ద విలేకరులతో మాట్లాడారు. ఈనెల పింఛన్ రాకపోవడంతో జంటనగరాల్లోని 168 మంది రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనేక మంది రిటైర్డ్ గ్రంథాలయ ఉద్యోగులకు షుగర్‌లు, బీపీలు ఇతరేత్రా జబ్బులతో సతమతమవుతున్నారని అన్నారు. మందులు, ఆస్పత్రుల్లో అనారోగ్య సమస్యలు చూపించుకునేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక అవస్థలు పడుతున్నారన్నారు. ప్రతి నెలా 1న రావాల్సిన పెన్షన్ ఇప్పటి వరకూ రాలేదన్నారు. గ్రంథాలయ అధికారులు సైతం తమ వంతు ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా రాలేదన్నారు. గతంలో ఇదేవిధంగా కొన్ని నెలలపాటు పెన్షన్ రాకపోవడంతో మందులకు డబ్బులు లేక కొందరు రిటైర్డ్ గ్రంథాలయ ఉద్యోగులు చనిపోయారని ఈ తరహా పరిస్థితి రాకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



చండీహోమం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ సురేష్ కుమార్ తదితరులు

వైభవంగా చండీహోమం

ముషీరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకొని మంగళవారం భోలక్‌పూర్ దేవుడి తోట.. భవాని శంకర ఆలయంలో ఆలయంలో మహారుద్రసహిత చండీహోమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్ కుమార్ విచ్చేసి పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ నెల 20వరకు ఆలయంలో వివిధ రకాల పూజలు నిర్వహిస్తామన్నారు. దేవాదాయ శాఖ ఈవో జ్యోతి, ధర్మకర్తలు పాల్గొన్నారు.



- **ఉమ్రా బాధిత కుటుంబసభ్యులకు పరామర్శ**

సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మృతిచెందగా.. బాధిత కుటుంబసభ్యులను మంగళవారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. పార్టీ యువ నాయకుడు ముఠా జైసింహా, నాయకులు ఖదీర్, అస్లామ్ తదితరులు పరామర్శించారు. కుటుంబీలకు మనోధైర్యం చెప్పారు.

- (ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి)



బర్కత్‌పుర భూమన్నగల్లీలో ఒరిగిపోయిన భారీవృక్షం, చెట్ల కొమ్మలను కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది మంగళవారం తొలగించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు సూర్యప్రకాష్‌సింగ్, భీమ్‌రాజ్, లావణ్య, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి